క్లుప్తంగా

‘అర్హులైన విశ్వకర్మలకు న్యాయం చేయాలి’

వనపర్తి రూరల్: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో శిక్షణ పొందిన 400 మంది అర్హులకు రూ.లక్ష వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని గురువారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, విశ్వకర్మ లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల అధికారి జ్యోతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎంఎస్ఎంఈ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని విశ్వకర్మలకు న్యాయం చేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, విశ్వకర్మలు వెంకటేష్, గోవింద్, పురుషోత్తం, మన్యం, వెంకటయ్య పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన పిరిసాల రాజేందర్ ఈ నెల 8న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేందర్ మృతి చెందడంతో భార్య లక్ష్మి, కూతురు చిన్మయి పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన 1986–87 విద్యా సంవత్సరంలో ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న మిత్రులు రూ.1,22,500 జమ చేసిన గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాలవాది భార్గవ శ్రీనివాసులు, సత్యశీలారెడ్డి, నరేందర్‌బాబు, నటరాజ్‌శర్మ, ఆంజనేయులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాతో రోగ నిరోధకశక్తి

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం, మానాజీపేట, మామిడిమాడ గ్రామాల్లో పశువులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వర్‌రెడ్డి పాడి రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో మే 14వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు సుసాన్‌కేసి, మాధవి, సహాయ వైద్యాధికారులు మల్లేష్, నర్సింహ, వీఎల్‌ఓ సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల విడుదల

వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్, దత్తాయిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ గురువారం పర్యటించి నాయకులతో కలిసి ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మాణిక్యం, నరసింహ, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

23న మందకృష్ణ మాదిగ రాక

వనపర్తిటౌన్: ఆత్మకూర్‌లో ఈనెల 23న ఏర్పాటు చేసిన డాక్టర్ బాబుజగ్జీవన్‌రాం విగ్రహ ఆవిష్కరణకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆత్మకూర్ మండల కమిటీ అధ్యక్షుడు జానకీరాములు ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలకు విడుదల చేశారు. కార్యక్రమంలో గద్వాల కృష్ణ, గంధం గట్టయ్య, మంద నరసింహ, అజపాగ లక్ష్మణ్, గట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

ఆత్మకూర్: అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆత్మకూర్‌లోని మాల్స్, పెట్రోల్ బంక్‌ల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి విన్యాసాలను ప్రదర్శించారు. ప్రమాదాలు జరుగకుండా, అలాగే జరిగిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, నర్సింహారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో సాధించిన ప్రగతి, ప్రభుత్వం కల్పించిన వసతులను వివరించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ శ్రీనివాసులు హెచ్‌ఎంలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి హెచ్‌ఎంల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత నోట్, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రాగి జావ, దుస్తులు, కంప్యూటర్ బోధన వంటి అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు.

పారదర్శకంగా ‘ఇందిరమ్మ’ లబ్ధిదారుల ఎంపిక

వనపర్తి రూరల్: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన వారిని గుర్తించాలని అదనపు కలెక్టర్ లోకల్‌బాడీ యాదయ్య అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని చిట్యాలలోని రైతువేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా నిర్వహించాలని వారికి సూచించారు. శ్రీరంగాపురం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు మండల ప్రత్యేకాధికారి సుధారాణి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఎంపీడీఓ రాఘవ, రవినారాయణ, ఎంపీఓ రవీంద్రబాబు, రాజు, ఏఓ కురుమయ్య, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన పేదవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు లబ్ధిదారుల ఎంపికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల మధ్యలో ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు ఎలాంటి పక్షపాతం లేకుండా పేదలకు



చిట్యాలలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ యాదయ్య

ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఈనెల 21వ తేదీ వరకు పూర్తి చేసి నివేదికలు అందించాలని కోరారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో అనర్హులు ఉంటే కమిటీ సభ్యులు, కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు పాల్గొన్నారు.

జాబితా సిద్ధం చేయండి

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాను ఈనెల 21న వరకు సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ సుగుణ, ఎంపీఓ రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖిల్లాఘనపురం మండలానికి మొదటి విడతగా ప్రభుత్వం 405 ఇళ్లు మంజూరు చేసిందని.. అందులో సల్కెలాపురం గ్రామానికి 100, మిగిలిన 26 గ్రామ పంచాయతీలకు 305 ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఏ గ్రామానికి ఎన్ని ఇళ్లు మంజూరు చేసిన జాబితాలను కార్యదర్శులకు పంపించినట్లు తెలిపారు.

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ బాలరాజు, మిషన్ భగీరథ ఏఈ రుక్మేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీల సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక వ్యవహారంలో నిరుపేదలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, డీపీఓ సురేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ఎంపిక విధానంలో అవలంబించాల్సిన పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నమ్మ, తహసీల్దార్ రవికుమార్ యాదవ్, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



పాన్‌గల్‌లో..



ఖిల్లాఘనపురంలో..

‘ప్రతి ఇంట్లో సన్నబియ్యం ఉడకాలి’



సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కొత్తకోట రూరల్: జిల్లాలోని ప్రతి పేద కుటుంబానికి సన్నంబియ్యం అందించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి అధికారులకు సూచించారు. పెద్దమందడి మండల కేంద్రంలో కలెక్టర్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి సన్నబియ్యం లబ్ధిదారు స్వప్న అనే దళిత కుటుంబానికి చెందిన ఇంటిని సందర్శించి, వారి ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నాణ్యమైన సన్నబియ్యాన్ని రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలు కూడా నాణ్యమైన ఆహారం తినాలనే ఆలోచనతోనే ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ సరస్వతి, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్‌గాంధీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కక్ష సాధిపు చర్యలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లు చేర్చడాన్ని నిరసిస్తూ గురువారం ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డుపై ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులుగౌడు, విజయ్‌కుమార్, క్యామ రాజు, ఆగారం ప్రకాష్, గంజాయి రమేష్, వెంకటేశ్వర్‌రావు, రవినాయక్, దేవన్న, జయకర్, బాలకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: బీజేపీకి ప్రజలు తొందర్లోనే బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.



ఖిల్లాఘనపురంలో ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై పెట్టిన కేసులను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సత్యశీలారెడ్డి, శివన్న, వెంకటేష్, నాగేషు, కొంకి రమేష్, సుధాకర్‌రావు, వెంకటయ్య, బాలపీరు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల సమస్యలు పరిష్కరించండి

అమరచింత: దళితవాడల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈమేరకు సీపీఎం మండల నాయకుడు అజయ్ మాట్లాడుతూ.. పట్టణంలోని 4, 5 వార్డుల్లో సమస్యలు తిష్ట వేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దళితులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 4వ వార్డులో మహిళల కోసం సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. పాత ఇనుప కరెంట్ స్తంభాలు తొలగించాలని, అంబేడ్కర్ భవనాన్ని అధికారికంగా ప్రారంభించి కంపౌండ్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. 1982లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు మాడిగేజ్‌లో ఉన్నాయని చెప్పి లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందించారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వనపర్తి రూరల్: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పిలుపులో భాగంగా గురువారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయం గేటు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 54,200 మంది పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత పేదలైన దళిత, బీసీ, మైనార్టీలైన గ్రామ పంచాయతీ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, రాములు, రాజు, కురుమయ్య, గోవిందమ్మ, వెంకటయ్య, గంగమ్మ, పెంటయ్య పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దుప్పల్లిలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్న మార్కెట్ చైర్మన్ ప్రశాంత్

గోపాల్‌పేట: మండలంలోని తిర్మలాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, బొజ్జన్న, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మండలంలో..

గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండల కేంద్రాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన వెంటనే డబ్బులు రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 414 కేంద్రాలు అవసరం ఉండగా.. నేటికీ 318 కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలో 80 మంది రైతులకు చెందిన తుంపర సేద్యం పరికరాలు అందించారు. కార్యక్రమంలో సత్యశీలారెడ్డి, శివన్న, సురేందర్‌గౌడ్, సురేష్‌గౌడ్, ఉద్యానశాఖ అధికారులు విజయభాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మదనాపురం: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ అన్నారు. గురువారం మండలంలోని దుప్పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కురుమూర్తి రాయ లిఫ్ట్ ప్రెసిడెంట్ మల్లెపల్లి రాజవర్ధన్‌రెడ్డి, శేఖర్, ఏపీఎం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఆత్మకూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేస్తున్న హమాలీలు, రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మూలమళ్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి హమాలీలతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, విశ్రాంతి తీసుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలని, అంబలికేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, చెన్నప్ప, బాలన్న, వెంకటన్న, కుర్మన్న, లక్ష్మన్న, హమాలీలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన వ్యక్తి మార్చి 11 నుంచి కనిపించడం లేదని అతడి తండ్రి బాలస్వామి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రామకృష్ణ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన బాలు పెబ్బేరు మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన జ్యోతి అనే వివాహితతో మార్చి 11న ఇంటి నుంచి వెళ్లి ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో తండ్రి బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

జూనియర్ కళాశాలకు ఫైర్ సేఫ్టీ సిలిండర్లు

వనపర్తి విద్యావిభాగం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంటలను ఆర్పే సిలిండర్లు అందుబాటులో ఉంచనున్నట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య గురువారం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ కృష్ణఆదిత్య ఆదేశానుసారం జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 99 మంటలను ఆర్పే సిలిండర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన నిధులను సంబంధిత ప్రిన్సిపాళ్లకు విడుదల చేశామని, కళాశాలలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటికి అదుపులోకి తెచ్చేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయన్నారు.. హైదరాబాద్‌లోని ‘ఫైర్ సేఫ్టీ ఇంజనీర్స్’ ఏజెన్సీ వనస్థలి హిల్స్ వారు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పరికరాలను అమర్చారన్నారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఖిల్లాఘనపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవినాయక్ కోరారు. గురువారం బీజేపీ నాయకులు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని మానాజీపేటలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. రెండో అంగన్‌వాడీ కేంద్రంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం వద్ద దుర్వాసన వస్తుందని, పరిశుభ్రత పాటించడం లేదన్నారు. చిన్నారులకు అందించిన ఆహారంలో నాణ్యత లేదని, అధికారులు మానాజీపేట రెండో అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరుకు గదిలో కనీసం ఫ్యాన్ కూడా లేకపోవడంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించకుంటే తామే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం మామిడిమాడలో జరుగుతున్న ఫిల్టర్ ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దార్ సుగుణకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దశరథం, గోపాల్‌రెడ్డి, యువమోర్చా మండల అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, మన్యం, చక్రవర్తి గౌడు తదితరులు పాల్గొన్నారు.

విత్తన కంపెనీపై చర్యలు తీసుకోండి

మదనాపురం: రైతులను నట్టేట ముంచిన ఓ ప్రైవేట్ సీడ్స్ కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గోవన్‌పేటలో నూజివీడు సీడ్స్ విత్తనాలు నాటి, నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ బస్తాల దిగుబడి వస్తుందని చెప్పిన కంపెనీ ఏజెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాటలు నమ్మి పదుల సంఖ్యలో రైతులు వరి పంట సాగు చేస్తే ఎకరానికి 10 నుండి 20 బస్తాల దిగుబడి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్వప్న, మల్లేష్‌గౌడ్, అంజన్నయాదవ్, కొండన్న, ఆంజనేయులు, వెంకటేష్, విష్ణుగౌడ్, మహమూద, వెంకటన్న, దాసరి కొండన్న తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి కోల్పోయాం.. ఆదుకోండి’

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఫ్రీ బస్సు పథకం ద్వారా తాము ఉపాధి కోల్పోయామని, ఆదుకోవాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు శివాజీరావు ఆధ్వర్యంలో డ్రైవర్లు రాష్ట్ర ప్రణాళిక కమిటీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి గురువారం విన్నవించారు. ఫ్రీ బస్సు పథకం ప్రారంభమైన నాటి నుంచి ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. స్పందించిన చిన్నారెడ్డి ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారిని ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, చిమనగుంటపల్లి, అంకూరు, బలిజపల్లి, జంగమాయపల్లి, పామిరెడ్డిపల్లికి చెందిన డ్రైవర్లు వెంకటేష్, తిరుపతయ్య, వహీద్, శివ, శాంతయ్య, రమేష్, సురేష్, హోలీ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న శివాజీరావు

ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలి

కొత్తకోట రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రావుల గిరిధర్ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి ఫిర్యాదుల నిర్వహణ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా ప్రవర్తించాలని, వారిపై పోలీసులపై నమ్మకం పెరిగేలా కేసుల దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలు, నిర్వహణ, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు ఇతర సామగ్రి పరిశీలించారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్‌ఐ ఆనంద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

వనపర్తి రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ చాటాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో వివిధ పోటీ పరీక్షల్లో బహుమతులు సాధించిన శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నాసా కాంటెస్టు పోటీల్లో (అడ్వాన్స్‌డ్ ఫార్మింగ్ బియాండ్ ఎర్త్) ప్రాజెక్టు ద్వారా వనపర్తి శ్రీచైతన్య హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు (లూనా టీం) ద్వారా రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి సాధించారు. దీంతో నాసా ప్రాజెక్ట్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు ఆడెం మనస్వీయాదవ్, వర్షిణి, వినూత్న, శ్రావ్య, అద్విత కు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందించి అభినందించారు. దీంతో పాటు ఐఎస్‌టీఎస్‌ఓ పరీక్షల్లో గ్రాండ్ ప్రైజ్ సాధించిన విద్యార్థి సూర్య, వర్షిత్, కృష్ణకు ల్యాప్‌టాప్ బహుమతిగా అందించారు. రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కోఆర్డినేటర్ గోపి, డీన్ అచ్యుత్, ప్రిన్సిపాల్ జవహర్‌బాబు, గైడ్ టీచర్ రమాదేవి ప్రత్యేకంగా అభినందించారు.



కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సాక్షి, నెట్‌వర్క్: గర్భిణులు, బాలింతలు రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సిబ్బంది సూచించారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు.

- ఆత్మకూర్ మండలంలోని గుంటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఏఎన్‌ఎం అనిత తదితరులు పాల్గొన్నారు.
- వనపర్తి మండలంలోని కడుకుంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీచర్లు భాగ్యలక్ష్మి, అలివేల, సుజాతరాణి, రామేశ్వరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కడుకుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడి కేంద్రంలో టీచర్ కవిత ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వరలక్ష్మి, చిన్నారులు, తల్లిదండ్రులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

వనపర్తి రూరల్: ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, వారితో పారితోషికం లేని పనులు చేయించొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ తీర్మానం ప్రకారం కార్మికులు స్కీం వర్కర్లందరినీ గుర్తించాలన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎన్ రమేష్, నందిమళ్ల రాములు, ఉమ, మద్దిలేటి, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు శారద, జ్యోతి, సుమతి, రాజేశ్వరి, విజయ, సంధ్యారాణి, సుమిత్ర ఉన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

వనపర్తిటౌన్: ప్రతి ఒక్కరిలో ఏదో ఒక రకమైన కళా నైపుణ్యం దాగుంటుందని, దాన్ని వెలికి తీసే ప్రయత్నం చేస్తే సమాజ చైతన్యానికి దోహదపడుతుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ బసలింగయ్య స్థానిక టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన హస్తకళ నైపుణ్యం (హ్యాండ్ క్రాఫ్ట్) శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి, శిక్షణ వివరాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, వయస్సుతో సంబంధం లేకుండా అందరూ శిక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, బాలస్వామి, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.